నిఘా నేత్రాలకు భద్రతకు భరోసా..



2



2

జీజీహెచ్‌లో అగ్నిప్రమాదం

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

## రెండురోజుల పాటు మీసేవ సర్వర్లు డౌన్

**అక్షరటుడే, ఆర్మూర్:** మీసేవ సెంటర్ల లో రోండురోజుల పాటు సేవలకు అంతరాయం ఏర్పడనుందని మీసేవ మండల అసోసియేషన్ అధ్యక్షుడు మీరా శ్రావణ్, కార్యదర్శి మీసాల సురేష్ తెలిపారు. ఈ మేరకు శుక్ర వారం ప్రకటన విడుదల చేశారు. సర్వర్ల మెయింటెనెన్స్ దృష్ట్యా ఈనెల మూడవ తేదీ సాయంత్రం 8 గంటల నుంచి 5వ తేదీ ఉదయం 8 గంటల వరకు మీ సేవ సర్వీస్‌లు అందుబాటులో ఉండవన్నారు. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.



“ కామారెడ్డి మున్సిపాలిటీ పాలన అస్తవ్యస్తంగా తయారైందా..? పాలనను సక్రమంగా నిర్వహించే అధికారులు పట్టించుకోవడం లేదా..? ప్రస్తుతం ఇద్దరు ముఖ్య అధికారులు సెలవులో వెళ్లడంతో పాలన స్తంభించే అవకాశాలు ఉన్నాయా..? అంటే అవుననే సమాధానం వస్తోంది. ఇటీవల జరుగుతున్న పరిణామాలు ఇందుకు ఉదాహరణగా చెప్పకోవచ్చు. మున్సిపల్ కార్యాలయంలో ఇష్టారాజ్యంగా పనులు కొనసాగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో అసలు ఏం జరుగుతుందోనన్న చర్చ సాగుతోంది. - అక్షరటుడే, కామారెడ్డి




# పాలన గాడిలో పడేనా..

- కామారెడ్డి బల్దియాలో అధికారులపై వేటుకు కౌన్సిల్ సభ్యుల తీర్మానం
- సెలవులో వెళ్లిన కమిషనర్.. ఆర్డీవోకు బాధ్యతలు
- సెలవులో ఉన్న టీపీవో విధులకు హాజరవుతారా..?
- రాకపోతే కొత్తగా వచ్చే అధికారులెవరో..

కామారెడ్డి మున్సిపాలిటీలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాజకీయం కొనసాగుతోంది. కౌన్సిల్ మొత్తం అధికారులపై గుర్రుగా ఉన్న ఘటనలు గతంలో లేవు. ప్రస్తుతం నూతన పాలకవర్గం కొలువై రెండు నెలలు కూడా కాకముందే కౌన్సిల్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారింది. దాంతో పాలకవర్గం పదవీకాలం ఎలా గడుస్తుందోనన్న చర్చ సాగుతోంది.

### ఇద్దరు అధికారులపై వేటు వేయాలని..

కామారెడ్డి మున్సిపల్ పరిధిలో మొత్తం 49 వార్డుల్లో వందల కాలనీలు ఉన్నాయి. ఆ కాలనీల్లో సమస్యలు ఉన్న మాట నిజమేనని అధికారులు కూడా ఒప్పుకుంటున్నారు. అయితే సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా బడ్జెట్ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరికలు జారీ చేసేలా ఏకంగా కమిషనర్, టీపీవోలపై సరెండర్ తీర్మానానికి పట్టుబట్టారు. దాంతో కౌన్సిల్ మొత్తం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది.

### సెలవులోనే వెళ్లిన అధికారులు తిరిగొచ్చేనా..?

మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి కంటే ముందే టౌన్ ప్లానింగ్ అధికారి గిరిధర్ సెలవుపై వెళ్లారు. బడ్జెట్ సమావేశం రోజు కమిషనర్ సెలవు పెట్టారు. ఈ ఇద్దరు అధికారులు మున్సిపాలిటీకి ముఖ్యమైన అధికారులు కావడంతో పాలన అస్తవ్యస్తంగా మారుతుందని తెలుస్తోంది. సెలవులో ఉన్న ఇద్దరు అధికారులపై కౌన్సిల్ సరెండర్ తీర్మానం చేయడం కొత్త చిక్కులను తెచ్చి పెడుతోంది. మున్సిపల్ చరిత్రలో ఇద్దరు అధికారులను టార్గెట్ చేయడం తొలిసారి అని ప్రచారం సాగుతున్న నేపథ్యంలో ఇప్పుడా అధికారులు తిరిగి విధుల్లో చేరతారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తిరిగి హాజరైనా వీరిద్దరిని సరెండర్ చేయడం పక్కా అని ప్రచారం సాగుతోంది.

### సెలవులో వెళ్లిన కమిషనర్..

పట్టణంలో సమస్యల పరిష్కారానికి ఖర్చు చేయాల్సిన నిధులపై ఏర్పాటు చేసిన బడ్జెట్ సమావేశం అధికారులను తీవ్రంగా కలిచి వేసిందన్న టాక్ వినిపిస్తోంది. ఈ కారణంగానే ఈ నెల 12 వరకు కమిషనర్ సెలవులో వెళ్లారని తెలుస్తోంది. దాంతో ఇన్‌ఛార్జి కమిషనర్‌గా కామారెడ్డి ఆర్డీవో గిరికి బాధ్యతలు అప్పగించారు. దాంతో మున్సిపల్ అంశం హాట్ టాపిక్ గా మారింది.

## ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



**అక్షరటుడే, భీమ్ గల్:** ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. వేల్పూర్ మండల పరిధిలోని జానకంపేట్ గ్రామంలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఆలయ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే సీడీపీ నిధులు రూ.5 లక్షలు, ఎంపీ నిధులు రూ.5 లక్షలు కలిపి మొత్తం రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధిలో తానెప్పుడూ ముందుంటానన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. అలాగే ఆలయాల అభివృద్ధి ప్రభుత్వం కూడా శ్రద్ధ పెట్టాలని.. అయితే హిందూ ఆలయాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ముందుకెళ్లాలి: అదనపు కలెక్టర్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో ముందుకెళ్లాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్ లో శుక్రవారం దొడ్డి కొమురయ్య జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రభావశీలిగా నిలిచారన్నారు. ఆనాటి దేశముఖ్‌ల అసంబద్ధ పాలనకు వ్యతిరేకంగా అత్యంత ధైర్య సాహసాలతో పోరాటం జరిపారని గుర్తుచేశారు. కొమురయ్య పోరాట స్ఫూర్తితో తెలంగాణా లో అనేక ప్రజాస్వామిక ఉద్యమాలు జరిగాయని, ఈ ఉద్యమాలకు కొమురయ్య పోరాటపటిమ ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. మహనీయుల కృషిని స్మరించుకునేందుకు, నేటి తరం వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలనే ఆకాంక్షతో ప్రభుత్వం మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందని తెలియజేశారు. మహనీయులు చూపిన బాటలో నడుస్తూ, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడడమే మనం వారికి అందించే నిజమైన నివాళి అని ఉద్బోధించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అభివృద్ధి అధికారి నర్సయ్య, వివిధ సంఘాల నాయకులు లక్ష్మణ్, దేవన్న, షేక్ హుస్సేన్, బంగారు సాయిలు, నరాల సుధాకర్, రాజేశ్వర్, నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 5న ఆర్మూర్‌లో హిందూ సమ్మేళనం

**అక్షరటుడే,ఆర్మూర్:** పట్టణంలోని రాజన్న గైని మున్నూరు కాపు కల్యాణ మండపంలో ఈనెల 5న హిందూ సమ్మేళనం నిర్వహించనున్నట్లు రాంనగర్ బస్తీ హిందూ సమ్మేళనం నిర్వహణ సమితి తెలిపింది. హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి సమైఖ్యపర్చి దేశాన్ని విశ్వ గురువుగా నిర్మాణం చేయాలన్న లక్ష్యంతో సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు సమితి ప్రతినిధులు తెలిపారు. ముఖ్య అతిథిగా బాల్కొండ నుంచి హరాచారి నారాయణస్వామి, అందాపూర్ లక్ష్మీ నృసింహస్వామి ఆశ్రమం అగు స్వామి మహరాజ్, ప్రధాన వక్తగా ఇందూర్ ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యవాహ రాజుల్‌వార్ దిగంబర్ హాజరుకానున్నట్లు తెలిపారు. రాంనగర్ బస్తీ పరిధిలోని రాంనగర్, జిరాయత్ నగర్, సంతోష్ నగర్, శాస్త్రి నగర్, హుస్నాబాద్, అరుంధతి నగర్ ప్రజలే కాకుండా ఇతరులు సైతం హాజరై సమ్మేళాన్ని విజయవంతం చేయాలన్నారు.





## అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బత్తుల నారాయణ

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. ఈ ఎన్నికలలో అధ్యక్షుడిగా బత్తుల నారాయణ, ప్రధాన కార్యదర్శిగా బండారు సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రాజు, సంయుక్త కార్యదర్శిగా భార్గవ్ చంద్ర భోపాల్, కోశాధికారిగా విఠల్ రావు, లైబ్రరీ సెక్రెటరీగా దేవేందర్ గౌడ్, క్రీడల కార్యదర్శిగా యాదగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులకు పోటీ ఉండడంతో ఆరుగురు బరిలో నిలవగా ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో గంగరాజు, సంజిత్, షేక్ ఇర్ఫాన్ హుస్సేన్ గెలుపొందారు. ఈ కార్యవర్గం ఏడాది పాటు కొనసాగుతుందని, బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ సూచనల మేరకు ప్రతి ఏడాది ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల అధికారి అమృతరావు వైద్య తెలిపారు.

## కులభేదం లేని హిందూ సమాజమే లక్ష్యంగా ముందుకు సాగాలి..

**అక్షరటుడే, గాంధారి:** కులభేదాలు లేని హిందూ సమాజమే లక్ష్యంగా ముందుకు సాగాలని బిచ్కుంద సోమాయప్ప సద్గురు స్వామీజీ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. దీంట్లో భాగంగా మొదట దుర్గా నగర్ చెక్‌పోస్ట్ నుంచి ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ హిందూ సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమన్నారు. అంటరానితనాన్ని నిర్మూలించి హిందువులంతా సంఘటితం కావాలన్నారు. హిందూ ధర్మపరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, వేగంగా మార్పు చెందుతున్న సమాజంలో జీవిత విలువలను కాపాడుకోవాలని సూచించారు. మరో అతిథి ప్రొఫెసర్ డాక్టర్ రామ్ సింగ్ మాట్లాడుతూ ప్రతి ఒకరిలో దైవభక్తిని పెంపొందించుకోవాలని, హిందూ సంప్రదాయాలను పాటించాలని సూచించారు. హిందూ ధర్మంలో తల్లికి ఉన్న ప్రాముఖ్యతను వివరించారు. ఆర్ఎస్ఎస్ ఇందూర్ విభాగ్ కార్యవహ రాజులవార్ దిగంబర్ మాట్లాడుతూ.. భారతదేశంలో హిందూ సామ్రాజ్యాన్ని ఎందరో కూలదోయాలని చూశారని, ఎన్ని కుతంత్రాలు చేసినా దేశాన్ని ఏమీ చేయలేకపోయారన్నారు. మన హిందూ దేశాన్ని కాపాడుకునే బాధ్యత మనపై ఉందని ఉద్ఘాటించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు రావు సాహెబ్ రావు, అధ్యక్షుడు భాస్కర్ గౌడ్, సిద్ధి రాములు, కృష్ణ గౌడ్, శంకర్‌రావు, దిలీప్ రావు, రవీందర్ గౌడ్, లక్ష్మణరావు, రాజు, భూపతి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.








## కాకతీయ ఇంజినీరింగ్ విద్యార్థుల ఫేర్‌వెల్ పార్టీ

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని కాకతీయ ఇంజినీరింగ్ కళాశాల (కిట్స్) విద్యార్థులు ఫేర్‌వెల్ పార్టీ జరుపుకున్నారు. ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నాలుగో సంవత్సర విద్యార్థినులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకతీయ కళాశాలల ఛైర్ పర్సన్ విజయలక్ష్మి మాట్లాడుతూ..గ్రామీణ యువతుల ఉజ్వల భవిష్యత్తు కోసమే కాకతీయ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థినులు కష్టపడి చదవి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కాకతీయ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ రజనీకాంత్ మాట్లాడుతూ విద్యార్థినులు ఏఐ టెక్నాలజీని వినియోగిస్తూ బాగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. భవిత్యత్‌లో బాగా చదవి కళాశాలకు జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తేవాలని కోరారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సెల్వరాజ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థినుల భవిష్యత్ ఉద్యోగాల కోసం వివిధ రంగాల్లో



అత్యుత్తమ శిక్షణనిచ్చామన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సాయారెడ్డి, ఎస్టేట్ మేనేజర్ నాగేశ్వర్‌రావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన నృత్యాలు ఆహుతులను విశేషంగా అలరించాయి.

www.aksharatoday.in

2 | నిజామాబాద్/కామారెడ్డి | శుక్రవారం | 3.4.2026

AKSHARA TODAY



## తండాల్లో తాగునీటి కష్టాలు..

## ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా..

**అక్షటుడే, పెద్దకొడప్‌గల్:** జిల్లాలో ఎండలు ముదురుతున్నాయి.. దీంతో తండాల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. మండలంలోని టీకారం తండాలో పరిధిలోని సర్దార్ తండాలో నీటి సమస్య ఏర్పడడంతో సర్పంచ్ స్పందించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని సర్దార్ తండాలో ప్రజలకు సర్పంచ్ రాజేందర్ ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ తండా ప్రజలకు తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో పంట పొలాల నుంచి నీళ్ల ట్యాంక్ నింపుకొని తండావాసులకు అందిస్తున్నామన్నారు. ఐదు రోజుల నుంచి మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని తండాలో ఉన్న బోరుబావిలో నీళ్లు అంతంత మాత్రంగా ఉన్నాయన్నారు. దీంతో జనాలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారన్నారు. ట్యాంకర్ ద్వారా నీళ్లు అందించడం ద్వారా తండావాసులకు కొంత ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. వేసవి కాలంలో తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు. మిషన్ భగీరథ అధికారులు నీటి సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు.



## తెలంగాణ ఉద్యమ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆశయాల సాధనకు కృషి..

**అక్షరటుడే, కోటగిరి :** తెలంగాణ ఉద్యమ తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని జిల్లా కురుమ సంఘం ఉపాధ్యక్షుడు ఈరుగొండ అన్నారు. పోతంగల్‌లోని దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈరుగొండ మాట్లాడుతూ.. భూమికోసం.. భుక్తి కోసం.. వెట్టిచాకిరి విముక్తి కోసం కొమురయ్య ఎన్నో పోరాటాలు చేశారన్నారు. దోపిడీలకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడి అమరుడయ్యారని.. ఆయన సాహసాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి నిలిచారన్నారు. ఉద్యమకారులకు స్ఫూర్తిగా నిలిచిన ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో షాజీ పటేల్, జగన్, బజరంగ్, విజయ్, సాయిలు ప్రభాకర్, రాజ్ కుమార్, మోహన్, మల్లు గొండ, సాయగొండ, శ్రీనివాస్, గంగొండ, భీంరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో నేరాలతో పాటు అసాంఘిక కార్యకలాపాలను అదుపు చేసేందుకు పోలీసులు నడుం బిగించారు. అన్ని గ్రామాల్లో ప్రజల సహకారంతో ప్రతి వీధిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ ఏర్పాటు చేస్తున్న నిఘా నేత్రాలు నేరాలకు అడ్డుకట్ట వేయడానికి దోహదపడుతున్నాయి. – అక్షరటుడే, భీమ్‌గల్



# నిఘానేత్రాలతో భద్రతకు భరోసా..

■ బాల్కొండ నియోజకవర్గంలో విస్తృతంగా సీసీ కెమెరాల ఏర్పాటు
■ సాంకేతికతతో భద్రత.. తగ్గుతున్న నేరాలు ■ నేరస్తుల గుండెల్లో గుబులు.. ప్రజల్లో పెరిగిన భరోసా

బాల్కొండ నియోజకవర్గంలోని మెండోరా, వేల్పూర్, మోర్తాడ్, భీమ్‌గల్, కమ్మర్‌పల్లి, బాల్కొండ, ముప్కాల్ మండలాల్లోని కీలక గ్రామాల్లో ఇప్పటికే సీసీ కెమెరాల నిఘా పెరిగింది. మెండోరా మండల కేంద్రంతో పాటు దూదిగాం వంటి గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద కెమెరాలను అమర్చారు. వేల్పూర్, భీమ్‌గల్‌లలో వాణిజ్య పరంగా రద్దీగా ఉండే ఈ ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లను నిఘా నీడలోకి తెచ్చారు. కమ్మర్‌పల్లి జాతీయ రహదారికి ఆనుకుని ఉండడంతో ఇక్కడ సీసీ కెమెరాల నిఘా వల్ల చోరీలు గణనీయంగా తగ్గాయి.

### కెమెరాలు లేక ఎదురైన సవాళ్లివే..

సీసీ కెమెరాలు లేని సమయంలో నియోజకవర్గంలో పలు సవాళ్లు ఎదురయ్యాయి. గతంలో సావెల్, పల్లికొండ వంటి గ్రామాల్లో తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా జరిగిన చోరీల కేసుల్లో క్లూస్ లభించక పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. మెండోరా మండలంలో పీడీఎస్ బియ్యం, ఇసుక అక్రమ రవాణా చేసే వారు నిఘా లేని మార్గాలను ఎంచుకునేవారు. సీసీ కెమెరాలు కావడంతో ఇటీవల దూదిగాం వద్ద పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. గ్రామ శివార్లలో ప్రమాదాలు జరిగినప్పుడు ఏ వాహనం ఢీకొట్టిందో తెలియక బాధితులకు న్యాయం జరగని పరిస్థితులు ఉండేవి.

### ప్రయోజనాలు అనేకం..

గ్రామాల్లో నేరాలు జరిగిన తక్కువ సమయంలోనే నిందితులను పట్టుకునేందుకు సీసీ ఫుటేజీలు కీలకంగా మారుతున్నాయి. కెమెరాలు ఉన్నాయనే భయం నేరస్తుల్లో నేరం చేయాలనే ఆలోచనలు కూడా తగ్గుతున్నాయి. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరిగితే వాస్తవాలను నిర్ధారించేందుకు ఈ నిఘా నేత్రాలు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

### పోలీసుల హెచ్చరిక..

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గించవచ్చని పోలీసులు పేర్కొంటున్నారు. ప్రతి గ్రామంలోనూ ప్రధాన కూడళ్లు, పాఠశాలలు, ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇవి కేవలం పోలీసుల ఆధారాల కోసమే కాకుండా గ్రామస్థులకు రక్షణగా ఉంటాయంటున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని ప్రతిగ్రామాన్ని 'సేఫ్ విలేజ్'గా మార్చే దిశగా ప్రజాప్రతినిధులు చర్యలు చేపడుతున్నారు. గ్రామాల్లో నిఘా పెరిగితేనే ప్రశాంతత సాధ్యమని అధికారులు చెబుతున్నారు.

## ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

**అక్షరటుడే, భీమ్‌గల్:** ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని మోతె గ్రామ కమిటీ సభ్యులు, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. వేల్పూర్ మండలం మోతె గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచేందుకు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామ కమిటీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ.. సర్కారు బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు వివరించారు.



ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ కమిటీ ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నడిపల్లి సీఎస్ఐ వెస్లీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** జిల్లావ్యాప్తంగా గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఆయా చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. డిచ్‌పల్లి మండలంలోని నడిపల్లి సీఎస్ఐ వెస్లి చర్చిలో పాస్టర్ ఎం.స్టీవెన్ కుమార్ ప్రత్యేక సందేశాన్ని వినిపించారు. క్రైస్తవులు ప్రార్థనల కోసం చర్చిలో ఏర్పాట్లు చేశారు.



## హిందూధర్మాన్ని దశదిశలా చాటిన మహోన్నత వ్యక్తి శివాజీ మహరాజ్

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** హిందూ ధర్మాన్ని దశదిశలా చాటిన మహోన్నత వ్యక్తి శివాజీ మహరాజ్ అని బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ ప్రతినిధులు అన్నారు. శివాజీ వర్ధంతి సందర్భంగా మండలంలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. శివాజీ మహరాజ్ హైందవ సామ్రాజ్యం అభివృద్ధికి ఎనలేని కృషి చేశాడని ప్రతినిధులు అన్నారు. ఆయన ఎన్నో దాన ధర్మాలు చేశారన్నారు. ఎందరో వీరులను తయారు చేసి హైందవ స్థాపన కోసం కృషి చేసిన యోధుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ఎల్లారెడ్డి అధ్యక్షుడు నవీన్, ప్రఖండ సంఘటన మంత్రి వినోద్, జిల్లా గోరక్ష ప్రముఖ్, తులసీదాస్, రాహుల్, యాదగిరి, యాదగిరి, ప్రకాష్, చక్రి వెంకట్, గణేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి



**అక్షరటుడే, భీమ్‌గల్:** బాల్కొండ నియోజకవర్గంలో వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ మంత్రి ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు భీమ్‌గల్, వేల్పూర్ మండలాల్లో పలు బీఆర్ఎస్ నాయకులు, ఇతర కుటుంబాలను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. చేంగల్‌కు చెందిన నాయకులు మోండేలా లింగం సోదరుడు ఇటీవల మరణించగా, ఎమ్మెల్యే వారి నివాసానికి వెళ్లి మృతుడి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం గోన్‌గొప్పులలో బీఆర్ఎస్ నాయకులు భూమేశ్వర్ తల్లి మరణించడంతో వారి కుటుంబాన్ని ఓదార్చారు.



## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని శెట్‌పల్లిలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ అట్టెం శ్రీను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సహకారంతో శెట్‌పల్లికి రూ.10 లక్షల నిధులను సీసీ రోడ్డుకు కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో రోడ్లన్నీ సుందరీకరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మన్నే బాలయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



### పరమళ్ల గ్రామంలో..


మండలంలోని పరమళ్లలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ బాబాయి నరేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ విభాగం సీజీఆర్ఎఫ్ ఫోర్త్ మెంబర్ మద్రిపల్లి రాజా గౌడ్, ఉప సర్పంచ్ శ్రీను, పంచాయతీ కార్యదర్శి శ్వేత, జీపీ పాలకవర్గ సభ్యులు ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ గంట లక్ష్మణ్, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవే లక్ష్యంగా డిగ్రీ విద్యార్థులు ముందుకు..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** సామాజిక సేవే లక్ష్యంగా ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ముందుకు సాగుతున్నారు. గ్రామీణులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ.. సైబర్ నేరగాళ్ల వలకు చిక్కకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో లక్ష్మాపూర్‌లో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడం లక్ష్యంగా ఏడు రోజుల పాటు నిర్వహించిన శిబిరంలో వలంటీర్లు గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. శిబిరం చివరిరోజు నిర్వహించిన ముగింపు సమావేశానికి కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో పాల్గొనడం అవసరమన్నారు. గ్రామాభివృద్ధి, పరిశుభ్రత, అవగాహన కార్యక్రమాల్లో వలంటీర్లు చూపిన కృషిని అభినందించారు.




## బడాపహాడ్ యాత్రికుల బస్సు బోల్తా.. 8 మందికి తీవ్ర గాయాలు




**అక్షరటుడే, బాన్సువాడ :** యాత్రికులతో వెళ్తున్న ఓ బస్సు బోల్తా పడింది. ఈ ఘటన వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని బడా పహాడ్ శివారులో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్ చెరు ప్రాంతానికి చెందిన యాత్రికులు ఒక ప్రైవేట్ స్కూల్ బస్సులో బడాపహాడ్ పుణ్యక్షేత్రానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో బడాపహాడ్ సమీపంలోని అటవీ ప్రాంతంలో మూలమలుపు వద్ద డ్రైవర్ బస్సుపై నియంత్రణ కోల్పోవడంతో బోల్తాపడింది. ప్రమాదం తెల్లవారుజామున జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 35 మంది యాత్రికులు ఉన్నారు. ఈ ఘటనలో 8 మందికి తీవ్ర గాయాలు కాగా.. మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని వెంటనే నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి..

**అక్షరటుడే, కామారెడ్డి:** గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన కామారెడ్డి మండలం రాఘవపూర్ శివారులో చోటుచేసుకుంది. గ్రామశివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడన్న సమాచారంతో పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి చూడగా మృతుడి వివరాలు తెలియరాలేదు. దాంతో మృతుడి ఫొటో పోలీసులు సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఆయన కుడిచేతిపై వి.చరణ్ అని పచ్చబొట్టు ఉందని పోలీసులు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అయితే సదరు వ్యక్తి హత్యకు గురై ఉంటాడని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతుడి చొక్కా మొత్తం రక్తంతో తడిసిపోయి ఉంది. అతన్ని హత్య చేసి ఉంటారన్న భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిస్తే తప్ప పూర్తి వివరాలు తెలిసే అవకాశం లేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## జీజీహెచ్‌లో అగ్నిప్రమాదం..



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్ :** జిల్లా కేంద్రంలోని జిల్లా జనరల్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటన శుక్రవారం ఉదయం జరిగింది. ఫైర్‌స్టేషన్ ఎస్ఎఫ్‌వో శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆస్పత్రిలో ఫస్ట్‌ఫ్లోర్‌లో పేషెంట్‌తో వచ్చిన ఓ వ్యక్తి బీడీ తాగి పడేయడంతో స్మోక్ పైప్‌కు నిప్పంటుకుని పొగ వ్యాపించింది. అది నేరుగా 6వ అంతస్తు వరకు వెళ్లింది. భారీ పొగను గమనించిన వైద్యులు వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. స్పందించిన అగ్నిమాపక శాఖ సిబ్బంది క్షణాల్లోనే ఆస్పత్రికి చేరుకొని రెండు ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి జీజీహెచ్‌కు చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. ఫస్ట్‌ఫ్లోర్‌లో స్మోక్ పైప్‌కు నిప్పంటుకోగా.. పొగ ఏకంగా 6వ ఫ్లోర్‌కు చేరింది. ఆరోఫ్లోర్‌లో భారీగా మెడికల్ సామగ్రి ఉంది. మంటలు అదుపులోకి రాకపోయి ఉంటే మెడికల్ స్టోరేజ్ సామగ్రి సైతం కాలిపోయి ఉండేది. సకాలంలో ఫైర్ స్టేషన్ సిబ్బంది స్పందించి మంటలను ఆర్పివేశారు.

